శ్రద్ధాం

వ్యక్తి బ్రతికి వున్నప్పుడు—ఆ వ్యక్తి బాగోగుల పట్ల శ్రద్ధ వహించకుండా వుండడం, మంచిని గుర్తించి గౌరవించకపోవడం సాంఘిక జీవితంలో సహజమైపోయింది. మరణిస్తే—హఠాత్తుగా ఎక్కడలేని ప్రాధాన్యం చూపిస్తారు. ఆ వ్యక్తి గుణగణాలను వేనోళ్ల కీర్తిస్తారు. బిరుదులిస్తారు. పూజలు కూడా చేస్తారు. మానవ నైజంలో ఈ కపటత్వం, కృత్రిమత్వం ఎందువల్ల చోటు చేసుకుంటాయి? మానవత్వపు విలువలు ఎందువల్ల పడిపోతున్నాయి? ఒక మంచి మనిషికి శ్రద్ధాంజలి ఏ విధంగా సమర్పించాలి?

"అన్ని గ్రహాల్లోకీ అనుగ్రహం పెద్దది...

జీవితంలో 'విధి' అన్నది మన బలహీనతను, చేతకానితనాన్ని బద్ధకాన్ని సూచించే మాట. గ్రహదోషం ఉండొచ్చు. కానీ, నివారణా ఉంటుంది... ఇది నా ఖర్మ... ఇంతే... అనుకుంటూ అనుభవించడానికే అలవాటు పడ్డారు జనం..."

ఇలా మాటల్లో జ్ఞానానికి మించినదేదో పొదిగి చెపుతున్నాడు, ఆ నది ఒడ్డున ఆ వ్యక్తి.

"తాంత్రికత వేరు... మాంత్రికత వేరు... యాంత్రికత వేరు. ఆధ్యాత్మికత వేరు... వీటన్నింటినీ కలపకండి... కోరిక అనేది వీటన్నింటికీ మూలం. దాన్ని ఆధ్యాత్మికత జయిస్తుంది. మానవుడు అధి మానవుడై పరిపక్వత వైపు

—జలంధర

జాలి

పురోగమించడం అనేది మూల సూత్రమైతే అన్నీ ఫలిస్తాయి. అటువంటి వ్యక్తి వలన పరిసరాలు ప్రాభావితమౌతాయి.

"అలా కాకపోవడం వలన... 'నా',... 'నాకోసం' మాత్రమే అన్న ఆలోచన వలననే ప్రకృతి నుంచి మానవుడు విడిపోతున్నాడు. దాని పిలుపు, తరంగ స్పర్శ అతనికి అందడంలేదు. అహం అసూయకు దారి తీస్తుంది. అజ్ఞానం ఆ తరవాతి మెట్టు. ఇంక ఇవి జారుడు మెట్లు... ఒక జీవిత కాలంలోనే వంద నరకయాతనలకు దారి వెతుక్కో గల సమర్థులం మనం. అందుకే...

"ఈ జీవితాన్ని ఒక పాఠశాల అనుకోండి... పాంథశాల అనుకోండి. ఇక్కడికి వచ్చింది మనం మనలోని వ్యక్తి మరింత ఎదగడానికి కానీ వచ్చిన పాఠాలు మర్చిపోయి వెనక తరగతులకు వెళ్లి పోవడానికి కాదు."

పై అర్థం వచ్చే మాటలు చిన్న చిన్న పదాల్లో పొదుగుతున్నాడాయన...

'అజ్ఞానం అవహించిన ఆ ఊరిలో ఆచారాల పేరుతో కుంచుకుపోయి ముడతలు పడ్డ ఆ వాతావరణంలో మతం మానవత్వాన్ని మంచితనాన్ని కాలికింద మెట్లుగా మార్చేసిన ఆ ఊరిలో—ఈ కొత్త వ్యక్తి సువార్తా వాణి... చింత చెట్లకు, గేదెలకు, ఆవులకు, పచ్చటి పైర్లకు ముక్క వంటబట్టని పశువుల కాపర్లకు తప్ప మరెవ్వరికీ అర్థం అయ్యే అవకాశం ఉందా?' అన్నట్లు అనిపిస్తుంది.

అతడు ఆ ఊరు వచ్చిన మొదట్లో మహనీయుడనీ, మహత్తులుకలవాడనీ, ఎదుటి మనిషి ఆలోచనలను గ్రహించే శక్తి కలవాడనీ, ఆయనకు సూక్ష్మ దృష్టి ఉందనీ, అణిమ, గరిమ శక్తులు ఉన్నాయని... ఇలా మనలో ఉండాలని కోరుకుని, సాధించలేనివన్నీ ఆయనకు అంట గట్టి వాళ్లే గొప్పతనం ఆపాదించుకుందామని వచ్చారు జనం.

కానీ ఆ ఊరి బ్రాహ్మణ్యం, కామందులు, రెడ్డి ప్రభువులు, వ్యాపారులు.... ఈ రకంగా డబ్బు ఆడంబరం ఉన్నవాడు తలవంచిన చోట తప్ప సామాన్యులు తలవంచని బలహీనత అక్కడి సంఘానికీ ఉన్నది.

అందుకే వాళ్లు శాసించేదే న్యాయం వాళ్లు విన్నదే వేదం అయి, వాళ్ల నగటు భావాలు సమాజాన్ని శాసించే అస్త్రాలై, ఆ తరవాత దిగజార్చుడు ప్రారంభమయ్యేది.

ఆ యతికి పాద పూజలు చేస్తామంటూ డబ్బుతో ఆయనను కొని తమ పార్టీ మనిషిగా మార్చుకుందామనుకున్న వాళ్ల ఆలోచనలు ఆయన దగ్గర ఫలించలేదు.

"డబ్బున్న వాడు తల వంచినంత మాత్రాన రాతి విగ్రహం దేముడవడు. దేముడులాంటి వ్యక్తి తనలో జ్ఞానశక్తిని తేజస్సును ధారపోసి ప్రాణ ప్రతిష్ఠచేస్తే అది కళలతో ఊపిరి పోసుకుంటుంది. ముందు మహోన్నతులైన మనుష్యులుగా మారండి. ఆ తరువాత మీరు ఊహించే దైవం మీ మధ్యకు దిగివస్తాడు..."

ఇలా ఆయన ఉపన్యాసం సాగిపోతోంది.

"ఇదెక్కడి గోలంట... ఒక ఉపనిషద్వాక్యం లేదు. ఒక్క వేదంలో మాటలేదు" వాపోతున్నాడు కుండలాల శాస్త్రి. "సంస్కృతమే మాటాడ్డు... ఓ మాట్లాడతాడు మళ్లీ..." యాన కూడా పోని పెద్దరెడ్డి శలవిచ్చాడు.

"మానవత్వం... మట్టి గడ్డ వగైరా అంటున్నాడు... కొంపదీసి కమ్యూనిస్టు ఇట్లా ఈ రూపంలో..." బక్క పలచటి సందేహప్రాణి కనుబొమ్మలు ఎత్తుతూ అన్నాడు.

"ఏమో... దెయ్యాలు వేదాలు వల్లిస్తాయంటే ఇదేనేమో..." అన్నాడు ఓ అసంపూర్ణ జ్ఞాని.

మొత్తానికి ఇలా తలోకరూ తలోక మాట అంటున్నారు. అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవునంటున్నారు... కాదంటున్నారు... కానీ తమాషా... ఆయనను ఏం చెయ్యాలో ఈ ఊరి పెద్దలకు అర్థం కాలేదు. కారణం అతను తన అవసరాలకు ఎవర్నీ దేహీ అనలేదు. ఎవరేది ఇచ్చినా తీసుకోడు. పైగా... తనే ఇస్తాడు... ఏది ఎవరికి అవసరమో... మంచిదో...

"ఖర్మ... ఏ స్మగులరో ఇట్లా యతి వేషంలో..." చేతినిండా బంగారపు గాజుల్తో, పెద్ద బొట్టుతో, స్థూల కాయం సరసమ్మ సందేహం.

కానీ లక్ష్మి... దానికి ఇవన్నీ వినిపించడం లేదు.

మొదట్లో ఆయనను ఆశ్చర్యంగా చూసేది. తరవాత ఇదెక్కడి నాటకమో... అని తప్పుకు తిరిగేది. మరికొన్నాళ్లకు ఆయన మాటలు కొన్ని విని ఆశ్చర్యపోయింది. ఆయన ఎవరినించీ ఏదీ ఆశించడం లేదని తెలుసుకుని నమ్మకమొచ్చి చెరువునించి నీరు తీసుకుంటూ చెరువు ఒడ్డున పాకలో ఉన్న ఆయనను చూసి దణ్ణం పెట్టి వచ్చింది.

ఆ ఊరికి నీటి ఎద్దడి... అందుకే లక్ష్మి లాంటి దిక్కులేని వాళ్లు బిందెకింత అని చెరువు నించి ఇంటింటికీ నీళ్లు మోస్తారు. ఆ మూలనించి అరు కోసుల దూరం నడిచి రెండు బిందెలు మోసుకెళితే రూపాయ డబ్బులు చేతులో పడడం గగనం.

ఆ ఊరి చెరువు లక్ష్మికి చిన్ననాటి నుంచీ పరిచయం. ఆ ఒడ్డునే ఆడుకుని పెరిగింది. అమ్మ అయ్యా—ఎలక్షన్ల కక్షల్లో ఊళ్లు తగల బెట్టుకుంటే అందులో మాడి మసయినప్పుడు—పిలక జడతో, ముఖమంతా కాటుకతో ముక్కు విగపీలుస్తూ తొమ్మిదేళ్ల పిల్ల అక్కను కౌగిలించుకుని ఏడ్చింది. కానీ, చాలామంది ఆ స్థితిలో వాళ్ల లాగే, దానికి ఆ దృశ్యం-కథల్లోలాగా కళ్ల ముందేం నిలిచి పోలేదు... ఆ తరవాత ఆ ఇద్దరు అనాథలూ ఎలా పెరిగారు? అంటే చెప్పలేం.

కానీ, లక్ష్మి అక్క చుక్కమ్మ ఎదిగింది. చక్కనిదైంది. పాచిపని చేస్తోంది. బతుకీడ్చుకొస్తోంది. తోడేళ్ల నీడల్లో నించి అలిసిపోయిన గుండెలతో ఎప్పటికప్పుడు పారిపోయి వస్తోంది. ఇవన్నీ ఎదుగుతున్న లక్ష్మికి అర్థమయ్యేవి కావు కానీ అక్క తన వంక చూసే జాలి చూపులతో ఎక్కడో గుండెల్లో మెలిబెట్టినట్లయ్యేది.

కానీ... ఒక రోజు ఏటి ఒడ్డున మెట్ల మీద కూర్చుని, "లచ్చీ! మనిద్దరం చచ్చిపోదాంటే..." అన్నప్పుడు ఆశ్చర్యపోయి భయంగా అక్క చెయ్యి పట్టుకుని—

"అక్కా! ఒద్దే... నాకు చచ్చి పోవాలంటే బయ్యం..." అన్నది.

ఉలిక్కి పడింది చుక్కమ్మ... "చావు బయమే... కానీ బతుకు? అది మరింత బయంకరం కదే..." అందామనుకుందేమో... కానీ ఎందుకో జాలిగా చూసి, కళ్లనీళ్లతోనే తళుక్కున నవ్వింది.

ఆ మర్నాడు చుక్కమ్మ శవం నదిలో తేలింది. గుండెలవిసేలా ఏడ్చిన లక్ష్మికి నిజం తెలియదు కాబట్టి గుండె పగిలిపోలేదు మరి.

చుక్కమ్మ నమ్ముకున్న టీకొట్టు రంగడు పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి దాన్ని లొంగదీసుకున్నాడు. గర్భవతినని కలల్లో తేలుతూ చెప్పడానికి వెళ్లిన ఆమెను పెద్దరెడ్డికి నైవేద్యం పెట్టాడు.

గొల్లుమంది చుక్కమ్మ.

"ఇప్పుడేమైందే పదినిమిషాలు కళ్లు మూసుకునే దానికి నీతేందే? నీతి? అయినా దిక్కు లేని వాళ్లకు నీతేంటి? నిజాయితీ ఏంటి? ఆ మాటలు ఉన్నోళ్లకు ఎలానూ లెఖ్ఖ లేదు. లేనోళ్లకు అవి ఎట్టాగూ ఉపయోగించవు. ఇంకెందుకు చెప్పు ఆ అర్థం లేని మాటలు?! నా మాట ఇని నువ్వూ నీ చెల్లీ నాలుగు డబ్బులు వయసులో ఉండగానే ఎనకేసుకోండి..."

ఈ మాటలు అన్నది పంచభూతాల సాక్షిగా తనను మనువాడుతానన్న రంగడివి.. బహుశ చుక్కమ్మ తను పాడైపోయానన్న బాధ కన్న తను నమ్ముకున్న ఏ సిద్ధాంతాన్నీ ఎవరూ ఆచరించరనీ, అవి తమబోటి వారికుంటే అగౌరవిస్తారనీ, జీవితానికీ ఆ మాటలకు సంబంధం లేదనీ తెలిసి... అవి అఖ్ఖర్లేదనుకున్న ఈ ప్రపంచంలో ఎలా బతకాలో తెలియక ఆత్మహత్య చేసుకుని ఉంటుంది పాపం...

కానీ, లక్ష్మికి ఇదంతా వివరంగా తెలియదు. దిక్కులేని దాన్ని పక్కింటి పార్వతమ్మ చేరదీసింది—చాకిరీ కోసం. బలవంతురాలు, డబ్బుగలది అయిన ఆవిడంటే ఊరందరికీ భయం కాబట్టి ఆవిడ పంచలో ఉన్న లక్ష్మి ఇంకా నీతి అవినీతి గడుల్లో పులి జూదం మొదలు పెట్టలేదు.

కానీ, ఆ పిచ్చి తల్లికి ఒక కోరికున్నది. అది ఎలా తీరుతుందో అక్క చచ్చిపోయిన ఇన్ని రోజులకన్నా తెలియలేదు. అక్కకు అంత్య క్రియలు సరిగ్గా జరగలేదు మరి.

అది నీళ్లు మోసే వాళ్లింట్లో సంకురాత్రి పండక్కి ఆర్భాటంగా గంగానమ్మకు చల్ది నైవేద్యం పెట్టి వారపోసి, చచ్చిపోయిన వాళ్ల పేరుతో ముత్తయిదువుల్ని పెట్టుకుంటున్నారు. అది ఆనవాయితీ మరి.

"ఓయమ్మ... అట్టా నీళ్లు పారబొయ్యమాకు. అంత దూరం నుంచి తెస్తున్నాం... నీకేం... అర్ధ రూపాయ పెట్టి కొనుక్కుంటావ్.. అయినా అవసరానికి మేం మొయ్యాలి గంద..." లక్ష్మితో పాటు నీళ్లు తెచ్చే నడివయస్సామె ఆ ఇంటి కొత్త కోడల్ని నీళ్లు ధబేలు మని ఒంపుతూంటే మందలించింది.

"అవసరమైతే కొనుక్కోగలం... అడ్డమైన వాళ్లూ చెప్పొచ్చే వాళ్లే..." కొత్త పాంజేబు పట్టాల పాదం ఝాడించి నేలకేసి కొట్టి పట్టుచీర పిస పిసతో ఛర్రున లోపలికి

పోయింది ఆ అమ్మాయి.

"ఓయమ్మ... నీళ్లాడితే కానీ నిదానం ఆడదంటారు... ఇదెక్కడి ఆడది!" బిత్తర పోయింది ఆ నీళ్లు మోసే ఆడది.

"అ! అనాడు ఇంటి కోడళ్లను తెచ్చుకుంటే సాము ద్రిక లక్షణాలు చూసి తెచ్చుకునే వాళ్లు. ఆ నడక, ఆ విరగబాటు... ఇంక ఈ ఇంట్లో సిరి నిలబడ్డట్టే... కట్నాలకు కక్కుర్తి పడితే, ఇంతేమరి" తిట్టిపోసింది మెటికలు విరుస్తూ వంటకు వచ్చిన మునలమ్మ. కానీ ఈ రభన అంతా పట్టించుకోవడం లేదు లక్ష్మి. మామిడాకు తోరణాలతో వసువు గడపల్లోంచి తొంగి చూస్తోంది.

అక్కడ పెద్దవంటింట్లో ఓరగా ఆ ఇంటి నలుగురు ఆడబడుచుల్నీ కూర్చోపెట్టి, పోయిన వాళ్లను తలుచు కుని కోడలి చేత వాయినాలు ఇప్పిస్తోంది, ఆ ఇంటి యజమానురాలు.

"మామ్మా! అదేంటి?" అడిగింది లక్ష్మి వంటమా మ్మని.

"అ! కుటుంబాల్లో ఎవరైనా సుమంగళులుగా పోతే వాళ్ల పేరు చెప్పి వసువు కుంకుమ చీరా జాకెట్టు పెట్టుకుంటారు... బతికున్నంత కాలం ఆ తల్లి ఆడ బడుచును దుమ్మెత్తి పోసి, ఆఖర్లో గుక్కెడు మంచి నీళ్లన్నా పోయకుండా చంపింది. ఇప్పుడు దెయ్యమై పట్టుకుందని ముత్తైదువుకు పెట్టుకుంటోంది... ఇదొక నంబడం... అయినా అట్టాంటివి ఏ బీద ముత్తయిదువు కో ఇస్తే పుణ్యం, పురుషార్థం కానీ, ఇలా కూతుళ్లకు, కావల్సిన వాళ్లకూ, పెట్టుకోవడమా?! చచ్చిన వాళ్ల ఆత్మల నంగతి భగవంతుడెరుగు. ముందు వీళ్లల్లో వీళ్లు—ఇస్తి నమ్మ వాయనం పుచ్చుకుంటి నమ్మ వాయనం... అంటూ అంతా వాళ్లల్లో వాళ్లకే..." ఆవిడ కడుపు మంటేమిటో కానీ అలా వెళ్లగక్కింది.

అట్లా చూస్తూ, వింటూ, ఆలోచిస్తూ నిలబడ్డ లక్ష్మి ఆ మాటలు నగమే విన్నది. మనసులో మెదిలింది. కన్నె ముత్తయిదువుగా వెళ్లిపోయిన అక్క చుక్కమ్మ. ఆమెకు దినం చెయ్యలేదు. ఏ రకమైన క్రతువూ చెయ్యలేదు.

"బలవంతంగా చచ్చినాళ్లు దెయ్యాలై తిరుగుతా రంట..." చుక్కమ్మ అంటే అసూయపడే పక్కింటామె మాటలకు ఎప్పుడూ ఒళ్లు జలదరించి పోయేది లక్ష్మికి.

అందుకే... ఆ క్షణంలో ఆ పిల్లకు ఒకటే ఆలోచన. అక్కయ్య ఆత్మ తృప్తికి ముత్తయిదువును పెట్టుకోవాలి. అదొక్కటే లక్ష్మి ధ్యేయం...

మెల్లిగా శాస్త్రి గారింటి గోడనానుకుని 'ఎట్టా చె య్యాలి అదంతా?' అని అడిగింది...

ఉయ్యాల బల్ల మీద కూర్చుని ఊగుతూ, నవ్యం వట్టిస్తూ తాంబూలం నములుతూ, "ఏమిటీ? నువ్వే నయం! మా వాళ్లల్లో ఆస్తి పంచుకోవడమే దినవారమైపో యింది... అయినా శ్రద్ధా భక్తితో చేసేది శ్రాద్ధం... ఏమిటి? పార్వతమ్మ దగ్గరే ఉంటున్నావా?! ఆ గంజి అన్నంలో ఏముంటుందే పూల పొట్లాల్లా తయారౌతారు మీరు... మా ఇళ్లల్లో అన్నీ వేసి పెట్టినా గడ కట్టల్లా ఉంటారు..."

ఆ మాటలన్నీ వినిపించుకోకుండా పరిగెత్తుకొచ్చే సింది లక్ష్మి. తనకు శ్రద్ధ, భక్తి ఉండి చేస్తే చాలు.. అక్క చుక్కమ్మకు చేరుతుంది అది.

ఆనాటి నుంచీ ఆ పిల్ల అడుగులు మరింత బలంగా పడేవి. చేతులు కందిపోతున్నా బిందె దించేది కాదు...

"ఏంటే ఎర్రిమొహమా? ఆ కష్టందేనికి? అప్పై నాలుగు రూపాయలూ నేనిస్తాలే ఆ చీరేదో కొనేసుకో..." అన్నది పార్వతమ్మ మూటల వాడి దగ్గర చీర లక్ష్మికే అనుకుని.

కొన్నది చీర లక్ష్మి.

వసువు కుంకుమ పొట్లాలు కట్టింది.

మెల్లిగా తను నీళ్లు మోసే వాళ్లింట్లోకి అడుగు పెట్టింది. దాని దృష్టిలో ఒక వెర్రి ఆలోచన ఉన్నది. ఎదిగీ ఎదగని దాని మనసుకు సంఘం విధించే కొన్ని నియమాలు అర్థం కావు మరి... అందుకే... "ఆ ఐశ్వర్య వంతులింటి ఆడబడుచులు పీట మీద కూర్చుని తన చేత కాళ్లకు వసువు రాయించుకుని, బొట్టు పెట్టించు కుని సలక్షణంగా వాయనం తీసుకుంటారు. అక్క చుక్కమ్మ ఆత్మ శాంతి పొందుతుంది. 'దెయ్యమై పోతుంది!' అన్న ఆ పక్కింటి ముదనష్టపు దాని శాపం ఫలించదు." ఇదే లక్ష్మి ఆలోచన.

అందుకే అజ్ఞానం ఇచ్చిన ధైర్యంతో అడుగు ముందుకు వేసింది, ఆ ఇంట్లోకి.

కానీ...

అవి ఇళ్లు కావు... సంఘంలో అరలు కట్టుకుని ఎవరికి వాళ్లు ఏర్పాటు చేసుకున్న జైళ్లు. ఏకాకితనం మనసుకు పట్టించుకుని, స్వార్థం మేసే నిప్పుకోళ్ల గూళ్లు.

ఆ ఇంట్లో అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటు న్నారు. పేరంటం జరుగుతోంది. నగలతో, అందమైన జలతారు చీరలతో ఖరీదైన నగలతో మెరిసిపోతున్నారు, ఆ ఇంట్లో మనుష్యులు. పాపం వచ్చేటప్పుడు ముఖం కడుక్కుని తల దువ్వుకునే వచ్చింది లక్ష్మి. కానీ, వాళ్ల మధ్య ఆ పిల్ల అలుగ్గుడ్డలా అనిపించింది వాళ్లకు. మానసిక అశుభ్రత దాచుకుని కడిగిన ముత్యాల మను కునే ఆ నాగరికులకు ఆ పిల్ల కిలుంగ్లాసులా కనబ డింది. అంతకన్నా భరించలేనిది ఆ పిల్ల కోరిక.

వికటంగా నవ్వారు... ఏ మాత్రం సిగ్గు పడకుండా వెక్కిరించారు. తామెంత దిగజారిపోతున్నామో, ఎదటివారి కన్నీటి బొట్టు ఏ రకమైన శాపంగా మారు తుందో తెలియనితనంతో వేళాకోళమాడారు.

అక్కడే చాపమీద బొమ్మల పేరంటానికి వచ్చి కూర్చుని ఉంది, పెద్ద రెడ్డి భార్య తులసమ్మ.

గుడ్లల్లో నీళ్లు గుడ్లలో కుక్కుకుంటూ భోరున ఏడ్చే స్వతంత్రం, జరిగిన అవమర్యాద చెప్పుకునే దిక్కూ లేకుండా వెళ్లిపోతోంది లక్ష్మి గడపదాటి.

"లక్ష్మీ" ఎవరో పిలిచారు రోడ్డు మీద.

అరచేత్తో కళ్లంబడి నీళ్లు తుడుచుకుంటూ, వెక్కుతూ తలెత్తి చూసింది లక్ష్మి.

సొంత రిక్షాలో పెద్దరెడ్డి భార్య.

"రా! మా ఇంటికి పోదాం రా! నేను తీసుకుంటాను వాయనం..." ఆశ్చర్యపోయింది లక్ష్మి.

భావోద్వేగం వగైరా మాటలు అర్థం కావేమో కానీ ఎదటివారి బాధను, తమ దృష్టితో కొలవడం లాంటి గుణాలు కొంతమంది సంస్కార వంతులకు జన్మతః ఉంటాయి.

అందుకే అంతటి ఇల్లాలు... ఆ ఊరంతటికీ మహారా ణి... చెయ్యి జాచకలిగింది లక్ష్మిని రిక్షాలోకి ఎక్కించుకోడా నికి. బెదురుతూనే బండి ఎక్కింది.

మాటల్లో అక్కమీద ప్రేమా, చుక్కమ్మ చుక్కల్లో కలిసిపోవడం పక్కింటి ముగ్గు మాసింది అక్కను తిట్టే తిట్లూ... ఇవన్నీ చెప్పేస్తోంది, వింటోంది ఆవిడ సోగ కళ్లతో. ఇంతింత ఆ కళ్లల్లో ఎంతో ఆలోచన. చుక్కమ్మ ఎందుకు చచ్చిపోయిందో, చక్కదనాన్ని తన భర్త ఎలా కాటేస్తాడో తెలిసిన ఇల్లాలు ఆవిడ.

"రా!" లోపలికి తీసుకువెళ్లి కుర్చీలో కూర్చోపెట్టి కాఫీ ఇచ్చింది. కాళ్లకు వసువు రాయించుకుని, కుంకుమ తీసుకుని ముత్తయిదువు వాయనం తీసుకున్నది. ఆనందంగా ఆశ్చర్యంగా విచిత్రంగా చూస్తూ బోలెడు సంబర పడిపోయింది లక్ష్మి!

ఇప్పుడు చుక్కమ్మ ఆత్మ స్వర్గానికి నేరుగా వెళ్లి పోయిందనుకున్నది.

చేతుల్లో చీర చూస్తూ కూర్చుంది తులసమ్మ.

"లక్ష్మీ! నేనొకటి చెపుతాను వింటావా?" మెల్లిగా అడిగింది ఆ ఇల్లాలు.

"ఏంటమ్మా!" అనుమానంగా అడిగింది.

"ఇదుగో ఆ తురాయి చెట్టుకింద పచ్చి బాలింతరా లుంది.. చుక్కమ్మలా అన్యాయమైపోయిన పిల్ల... ఈ చీర పాపం ఆమెకు కప్పిరా... చలిలో బాధ పడు తోంది..."

"అదేంటమ్మగారూ!" తెల్లబోతూ అడిగింది.

"అదంతే... చూడు. నువ్విచ్చిన చీర నాకున్న వంద చీరల్లో ఒకటి. అవునా?! ఇది నా చీర కాబట్టి, నువ్వు నాకిచ్చేశావు కాబట్టి నేను ఎవళ్లకైనా ఇవ్వచ్చు... కానీ, నువ్వు నీ చేత్తో ఇచ్చి చూడు. ఆ ఎండ వానలో అవస్థపడుతూ చిరిగిన చీరలో ఆ పచ్చి బాలింతరాలి కి... కలిగే సంతోషం... అదుగో అదే ఆత్మ తృప్తి పడటం అంటే... అర్థమైందా?"

సందేహంగా చూస్తోంది లక్ష్మి.

"కావాలంటే... ఆ చెరువు ఒడ్డున ఉన్నారే మహానుభా వులు... ఆయనను అడుగు..." మెల్లిగా మాటలు పేరు స్తూ అన్నదామె.

అప్పుడు ఉలిక్కిపడింది లక్ష్మి.

"అరు మీకు తెలుసా? ఆయన గొప్పోరా అమ్మగా రూ!" అడిగింది మేక కళ్లతో.

ప్రపంచం అంతా చాలా వరకు మేకలే. బలవంతు లు ఐశ్వర్య వంతులూ తోలే త్రోవలో పోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మాట్లాడలేదు తులస మ్మ.

ఏమని చెప్తుంది? అతను తన మేనబావ అని చెప్తుందా? అతని పేదరికం తనను అతనికి దూరం చేసిన విషయం చెపుతుందా? డబ్బుతో ఎకరాలతో, చక్కెర ఫాక్టరీ షేర్లతో తన చక్కదనాన్ని మంగళ సూత్రం అనే లైసెన్సు బిళ్లతో దోచుకున్న భర్తను గురించి చెపుతుందా?! తను దొరకలేదని వేదాంతై తిరిగి ఇక్కడ జనానికి జ్ఞానం చెప్పాలని వచ్చిన ఆ యతి గురించి చెపుతుందా? తన భర్తలాంటి వారు ఊరును దోచు కుంటూంటే, ఊరి మధ్య మూగదేవత భోగాలతో తృప్తిపడుతూంటే, ఊరి చివర చెరువు ఒడ్డున ఉండి మంద లాంటి మనుష్యులకు తెలివి నేర్పి రెచ్చగొడుతున్నాడన్న

అసూయతో అతన్ని అంతమొందించాలన్న పెద్దల గురించి చెప్తుందా?!

కళ్ల నుంచి ధారాపాతంగా కన్నీరు కురుస్తూంటే, తలుపుకానుకుని శూన్యంలోకి చూస్తున్న ఆ అభాగ్యురాలైన సౌందర్యవతిని చూడగానే పాపం ఎందుకో లక్ష్మికి జాలేసింది.

"అట్లాగే... మీరు చెప్పినట్లే చేస్తా అమ్మగారూ..." అన్నది.

ఆ మాటల్లో ఆవిడకు ఓదార్పు, ఉద్ధరింపు రెండూ వినిపించాయేమో ఉలిక్కిపడింది ఆవిడ.

"చూడు లక్ష్మీ! నీకేం కావాలన్నా నా దగ్గరకురా ఏం?! ఒకవేళ ఈ అమ్మగారు పోయిందనుకో... అప్పుడు మా ఇంట్లో నాకు శ్రాద్ధాలు క్రతువులూ చేస్తారు, దానాలిస్తారు... అయినా నువ్వు మాత్రం మీ యతినడిగి డబ్బు తీసుకుని ఒక మనిషికి ముత్తైదువుగా పెట్టేం..." కళ్లనీళ్లు ధారాపాతంగా కారుతూ సర్వైశ్వర్య సంపన్నురాలైన ఆ అభాగ్య యువతి కోరికకు అర్థం ఏమిటో... ఆ ఎదిగీ ఎదగని పిల్లకు అర్థం కాలేదేమో కానీ చీర తీసుకుని మెల్లగా చెట్టు కిందకు నడిచింది.

"పశుపతి అంటే ఎవరు?! గొడ్డూ, గోడు కాముకునే వాడు కాదు... మనుష్యుల్లో పశుత్వం అణిచి, దైవత్వాన్ని ప్రతిష్ఠింపచేసేవాడు... ఉపవాసం అంటే మనలో బలవత్తరమైన కోరికలకు అడ్డు వేయడం... అంతేకానీ అన్నం మానుకుని, ఇష్టమైన అన్నీ తినడం కాదు..." ఇలా చెపుతున్నాడు యతి జనానికి. ఇతని ఉపన్యాసం వల్లో, జనాన్ని ఆలోచింప చెయ్యడం వల్లో మందలాంటి మనుష్యుల్లో అలజడి ప్రారంభమైంది. ధనబలం, అధికార మదం ఉన్నవాళ్లు ఇది భరించలేక పోయారు... యతి తమ స్థానాలకే ఎసరు తెస్తాడన్న భయంతో అతణ్ణి చంపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్దరెడ్డి ఇంట్లో జరిగే ఈ సమావేశం తెలిసింది తులసమ్మకు. ఎదురు తిరిగింది, భర్తకు మొదటిసారిగా.

"నువ్వు పొరపాట్లు చేస్తే నేను పట్టించుకోలేదు. తప్పులు చేస్తే నిన్ను క్షమించమని దైవాలకు మొక్కాను. నువ్వు పాపాలు చేస్తే, నీ బదులు నన్ను శిక్షించమని ఏడ్చాను. కానీ, ఇప్పుడు నువ్వు చెయ్యబోయేది వీటన్నింటికీ మించింది" అన్న ఆమె మాటలకు ఆశ్చర్యపోయాడు పెద్ద రెడ్డి. ఎప్పుడూ ఎదురు తిరగని ఆ మామూలు ఇల్లాలు మహిషాసుర మర్దినిలా చూసేటప్పటికి పంతం వచ్చింది అతనికి. గొడ్డును బాదినట్లు బాదాడు.

"ఈ రాత్రే వాడి అంతు చూస్తాను." అని ప్రతిజ్ఞ చేశాడు. అందుకే పదేళ్ల తరవాత మొట్ట మొదటిసారిగా, అడుగులు తడబడుతూ అతణ్ణి చూడ్డానికి వచ్చి తురాయి చెట్టు చాటునుంచి అతని మాటలు వింటోంది ఆమె. ఆమెకు తోడుగా వచ్చిన లక్ష్మి ఆశ్చర్యంగా ఇద్దరి వంకా మార్చి మార్చి చూస్తోంది.

కళ్లెత్తి చూడలేక తలవంచి నమస్కరించింది తులసమ్మ. తడబడుతూ విషయం చెప్పింది.

ఆశ్చర్యపోలేదతను. హాయిగా నవ్వాడు.

"నేను నమ్మినవి శ్రీ చరణాలు. సర్వేశ్వర చరణాలు. అవే నన్నాదుకోకపోతే, మనుష్యులు, పలాయన మార్గం కాపాడతాయనుకోవడం కల్ల...." స్పష్టంగా చెప్పాడు.

ఆశ్చర్యపోయిందామె అతని ఆత్మ స్థైర్యానికి.

భయపడి పోతోందామె, అతని ప్రాణాలకోసం.

'ఎక్కడో ఒక చోట, ఎలాగోలాగ బ్రతికుంటే చాలు' అన్న పిచ్చి బేల ప్రేమికురాలైపోయింది.

రెండు వందల ఎకరాలు, నాలుగు కిలోల బంగారం ఉంది. ప్రపంచపు దృష్టిలో మహారాణి అయిన ఆ యువతి ఆయన కాళ్ల మీద తెగిన పూదండలా పడి ఏడ్చింది. ఆ దృశ్యానికి లక్ష్మి ప్రేక్షకురాలిగా మిగిలిపోయింది.

ఆఖరి అస్త్రం... "నా కోసం... నా కోసం పారిపో..." అని రెండు చేతులూ జోడించింది.

నవ్వాడతను. వెన్నెల్లో అతని నవ్వు కాంతికిరణమై... భూమినించి ఆకాశానికి ప్రయాణించింది. చంద్రుడు మరింత ప్రకాశవంతంగా వెలిగాడు. చుట్టూ నది... వెండి వెన్నెలా... సాక్షీ భూతంగా తురాయి చెట్టు, అమాయకురాలు లక్ష్మి. "నువ్వు లేని ప్రపంచంలో సర్వం పోయిందనుకున్నాను నేను. కానీ సర్వంలోనూ నువ్వు, నేనూ, మనందరం కూడా ఛాయా మాత్రంగా చూసే స్థితికి వెళ్లాను నేను... నువ్వు నేను వేరనే స్థితి వెళ్లిపోయింది ఎప్పుడో. ఈ జీవననాటకంలో నీ పాత్ర నువ్వు పూర్తి చెయ్యి. నా పాత్ర నేను వేస్తాను. నీ భర్త పాత్ర అతను పూర్తి చేస్తాడు. ఎటొచ్చీ తుది మొదలు తెలిసి ఏదీ నన్ను అంటకుండా నేను ప్రవర్తిస్తున్నాను. అర్థమయీ అర్థమవని స్థితిలో నువ్వున్నావు... అజ్ఞానంలో అతడున్నాడు అంతే..."

అవాక్కైపోయింది ఆమె. ఆశ్చర్యంగా చూసింది. అతను ఏదో తననుంచి దూరమై విరక్తితో 'యతి' అయ్యాడనుకుంది. ఇన్నాళ్లూ తన అహం ఆ రకంగా సంతృప్తి పరుచుకొని బతుకుతోంది.

కాని అతనూ? తననూ తన భర్తనూ, ఈ ప్రపంచాన్ని వీటన్నింటిని కూడా ఒకే రేఖలో చూడగలిగినంత ఎత్తుకు ఎదిగాడు... తనొక పాత్రధారినంటూ, తనేమిటో అనలేమిటో చెప్తున్నాడు.

అహం, అభిజాత్యం, తన స్త్రీత్వానికుండే సౌందర్య గర్వం ఇవన్నీ పొరలు పొరలుగా ఆమెను వదిలి పోతున్నాయి. మానవత్వం, పరిపూర్ణ స్త్రీత్వం నిండిన ఆ స్త్రీ మూర్తిలో ఏదో వెలుతురు... వెలుగు... చెంపన చెయ్యి పెట్టుకుని ఆ ప్రశాంత సమయంలో అతని పాదాలవంక చూస్తూ కూర్చున్నది. ఆ తురాయి చెట్టు చీకటి నీడలో, ఆ వెలుతురులో ఆ ముగ్గురూ ఏదో అదృశ్య హస్తం వెలిగించిన దీపాల్లా ఉన్నారు.

కానీ పరిపూర్ణత అజ్ఞానాన్ని భరిస్తుందేమో కానీ, అజ్ఞానం, మూర్ఖత్వం సౌందర్యాన్ని సత్యాన్ని నిశ్చలత్వాన్ని భరించలేదు.

తన మూర్ఖపు పట్టుదలతో యతిని చంపక తప్పదంటున్న భర్తను ఆపలేక ఆత్మార్పణ చేసుకున్నది పెద్ద రెడ్డి భార్య—తులసమ్మ.

తన అసూయకు కారణమైన అసలు వ్యక్తి పోగానే, అసలు ఆమే తనకు ఏమిటో తెలుసుకుంటున్న రెడ్డి చల్లబడ్డాడు. ఆ సంవత్సరం ఎలక్షన్లలో అతను నిలబడలేదు. వడ్డీ వ్యాపారం మూసేశాడు. అది వరకు పటాటోపం లేదు. ఇప్పుడిప్పుడే ఆలోచిస్తున్నాడు.

ఆవిడ సంవత్సరీకాలు మరెవ్వరూ చేయించలేనంత ఆర్భాటంగా చేయించాడు రెడ్డి. వెండి గ్లాసులు, జరీ ఉత్తరీయాలు ఇచ్చాడు. తొమ్మిది మంది ఖరీదు గల ముత్తయిదువులకు పట్టు చీరలు పెట్టించాడు.

కానీ—నది ఒడ్డున చింకి గుడ్డల లక్ష్మి డబ్బంతా దాచుకుని మిల్లు చీర కొన్న లక్ష్మి ఏటి ఒడ్డున పడుకున్న ముసలిదానికి ఆ చీర ఇచ్చి అమ్మగారి పేరు చెప్పి కన్నీళ్లతో దణ్ణం పెడుతున్నది... సాక్షీభూతంగా నిలబడి చూస్తున్నాడు యతి. రెడ్డిగారి భార్య రూపంలో వచ్చి మౌనంగా అతని పాదాలు తడుపుతోందా అన్నట్లున్న ఆ నదీమ తల్లి... ఆమె కన్నీటి ఆశీర్వచనాలా అన్నట్లు రాలుతున్న తురాయి పూవులు...

ఈ అద్భుత సౌందర్య దృశ్యాన్ని సర్వేశ్వరుడనే మహా చిత్రకారుడు తప్ప రచించలేడేమో! □

పాఠకులకు మరో కొత్త శీర్షిక

"నేను-నా విద్యాలయం"

తాము చదువుకున్న విద్యాలయాలను, తమకు విద్యా బుద్ధులు నేర్పి, వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దిన గురువులను ఎవరూ తేలికగా మరచిపోలేరు. ఐతే, ఉన్నత పాఠశాల, కళాశాల దశల్లో ఎందరో అధ్యాపకులు విద్యాబోధన చేసినా కొందరు మాత్రమే జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అలా మీ హృదయంలో ప్రత్యేక స్థానాన్ని పొందిన విద్యాలయం గురించి, అధ్యాపకులలో మరపురాని వ్యక్తి గురించీ (వారి ధోరణిని వ్యక్తం చేసే అనుభవాలను విశదీకరిస్తూ) రెండు పేజీలకు (అరఠావు సైజులో ఒకవైపునే) మించకుండా రాసి, మీ ఛాయాచిత్రాన్ని వ్యాసంతో జతపరచి, 'నేను-నా విద్యాలయం' శీర్షిక పేరిట పంపించండి. ప్రచురణకు స్వీకరించని రచనలను తిప్పిపంపగోరేవారు తమ చిరునామాతో స్టాంపులు అతికించిన కవరును జతపరచాలి. ఈ శీర్షికలో స్త్రీలు, పురుషులూ పాల్గొనవచ్చును. ప్రచురితమైన ప్రతి రచనకూ పారితోషికం వుంటుంది.

సాంఘిక ప్రగతిలో అధ్యాపకులు నిర్వహిస్తున్న ముఖ్య పాత్ర విశిష్టత గురించి అందరికీ తెలియడంకోసం ఉద్దేశించిన ఈ శీర్షికలో విద్యార్థినీ, విద్యార్థులను కూడా అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

—వ॥ సం॥